

రూ.50 లక్షల ప్రభుత్వ భూమి

కబ్జా!

- మచిలీపట్నం-చిన్నాపురం ప్రధాన రహదారి పక్కన 2 ఎకరాల డ్రెయినేజీ పోరంబోకు భూమిలో వేసిన ప్లాట్లు
- బుసక తోలి మెరక చేస్తున్న ఆక్రమణదారులు
- గ్రామస్తుల ఫిర్యాదుతో పనులు అడ్డుకున్న అధికారులు
- అధికారులు వెళ్లగానే మళ్లీ మెరక పనులు ప్రారంభం



మచిలీపట్నం-చిన్నాపురం రహదారి పక్కనే రుద్రవరంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి మెరక చేసిన ప్రాంతం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: మచిలీపట్నం మండలం రుద్రవరం, గుండుపాలెం గ్రామాల సరిహద్దున మచిలీ పట్నం-చిన్నాపురం ప్రధాన రహదారి పక్కనే ఉన్న రూ.50లక్షల విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. అక్రమార్కులు రెండేళ్లుగా తెరవెనుక వ్యూహం రచించారు. డ్రెయినేజీ పోరంబోకు భూమి అయినప్పటికీ ఇద్దరు, ముగ్గురు మధ్య ఈ భూమి కొనుగోలుకు సంబంధించిన లావాదేవీలు నడిచినట్లు డాక్యుమెంట్లు సృష్టించారు. గతేడాది ఈ భూమిని ప్లాట్లుగా విభజించి అమ్మకానికి పెట్టారు. గత రెండు రోజులుగా గోపువానిపాలెం గ్రామం నుంచి రాత్రి సమయంలో బుసకను తరలించి ఈ భూమిని మెరకచేసే పనులను చేస్తున్నారు. దీంతో రుద్రవరం, గుండుపాలెం గ్రామస్తులు ఈ అంశంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ భూమిని ఎంతోకాలంగా బొంబాయికాలువగా పిలుస్తామని, డ్రెయినేజీ పోరంబోకు భూమిగా రికార్డులలో ఉందని గ్రామస్తులు అధికారులకు తెలియజేశారు. ఈ నెల 24వతేదీ అర్ధరాత్రి టిప్పర్ల ద్వారా బుసకను తరలించి ఈ భూమిని మెరక చేస్తుండటంతో, రెండు గ్రామాలకు చెందిన ప్రజలు రెవెన్యూ అధికారులకు విషయం తెలియజేశారు.

పంట కాలువను పూడ్చేశారు..

పంట భూములకు సాగునీటిని అందించే చిన్నపాటి పంట కాలువను సైతం పూడ్చివేసి ప్రభుత్వ భూమిని మెరక చేస్తున్నారని గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి పనులను నిలిపివేశారు. గత మంగళవారం రాత్రి సమయంలో మళ్లీ టిప్పర్ల ద్వారా బుసకను తరలించి మెరక చేసే పనులను ప్రారంభించారని గ్రామస్తులు మళ్లీ అధికారులకు సమాచారం ఇచ్చారు. ప్రభుత్వ పోరంబోకు భూమిపై కన్నేసిన కొందరు పెద్దలు తలో 20సెంట్ల భూమిని కొనుగోలు చేసినట్లుగా తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి భూమిని ఆక్రమించేస్తున్నారని రుద్రవరం, గుండుపాలెం మిగతా 6లో..



పీటీ ఉషకు స్వాగతం

ఇండియన్ ఒలింపిక్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు పీటీ ఉషకు గురువారం గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. హైదరాబాద్ నుంచి విమానంలో ఇక్కడికి విచ్చేసిన ఆమెకు క్రీడా సంఘాల ప్రతినిధులు స్వాగతం పలికారు. అనంతరం సీఎం చంద్రబాబును కలిసేందుకు ఉష రోడ్డు మార్గంలో వెళ్లారు.

- గన్నవరం, ఆంధ్రజ్యోతి

కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జిల్లాలో గురువారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 63,114 మంది ఓటర్లు ఉంటే 44,131 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం పోలింగ్ శాతం 69.92గా నమోదైంది. మచిలీపట్నంలో మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

69.92%

ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు

- గుంటూరుకు బ్యాలెట్ బాక్సుల తరలింపు
- ఓటు హక్కును వినియోగించుకున్న మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ
- పోలింగ్ సరళిని పరిశీలించిన కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు





మచిలీపట్నం సెయింట్ ఫ్రాన్సెస్ హైస్కూల్‌లో బారులు తీరిన మహిళా ఓటర్లు, మచిలీపట్నం హిందూ కళాశాలలో ఓటు వేసి వస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లాలో కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం ఎనిమిది గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న ఓటర్లకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అధికారులు అవకాశం కల్పించారు. ఉదయం 10 గంటలకు 12.45 శాతంగా పోలింగ్ నమోదు అయ్యింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఓటర్లు భారీగా తరలివచ్చారు. సాయంత్రం నాలుగు గంటలకు జిల్లాలో 69.92శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. కూటమి ప్రభుత్వం బలపర్చిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తరఫున కూటమి నాయకులు, పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు తరఫున కమ్యూనిస్టులు, వైసీపీ నాయకులు స్లిప్‌లు రాసి తమ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ ఎన్నికల్లో ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎవరికి ఓట్లువేశారనే అంశంపై చర్చ జరుగుతోంది, వీరి ఓట్లే ప్రధాన పోటీలో ఉన్న కూటమి, పీడీఎఫ్ అభ్యర్థుల గెలుపు ఓటములపై ప్రభావం చూపుతాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

కలెక్టర్ పర్యవేక్షణ

జిల్లాలోని పలు ప్రాంతాల్లో కలెక్టర్ బాలాజీ పర్యటించి పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నుంచి డీఆర్వో కె.చంద్రశేఖరరావుతో కలసి పోలింగ్ సరళి, పోలింగ్ కేంద్రాల వద్ద నెలకొన్న పరిస్థితులను గమనిస్తూ అధికారులు, పోలీసులకు సూచనలు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి కొల్లు, కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం హిందూ కళాశాలలోని పోలింగ్ కేంద్రంలో రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మచిలీపట్నంలోని హైనీ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రానికి కలెక్టర్ బాలాజీ సతీసమేతంగా వచ్చి ఓటు వేశారు. కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మచిలీపట్నం హిందూ కళాశాల, పెడన తదితర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చి పోలింగ్ సరళిపై ఆరా తీశారు.

బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన

జిల్లాలో ఎస్పీ ఆర్.గంగాధరరావు పర్యటించారు. కంకిపాడు, ఉయ్యూరు, పామర్రు, మచిలీపట్నం, గూడూరు తదితర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. బందోబస్తుపై పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఏఎస్పీ వీవీ నాయుడు గన్నవరం, గుడివాడ ప్రాంతాల్లో, ఏఆర్ ఏఎస్పీ బీసత్యనారాయణ అవనిగడ్డ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

పోలైన ఓట్లు 44,131

జిల్లాలో 63,114 మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ ముగిసే సమయం సాయంత్రం నాలుగు గంటలకు 44,131 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుష ఓటర్లు 25,028 మంది, మహిళా ఓటర్లు 19,103 మంది ఉన్నారు.

అటానమస్ లేకుండానే..

కోర్సుల ఆఫర్

ఆంధ్రా లయోల కళాశాల నిర్వాకం

- కృష్ణా యూనివర్సిటీ త్రిసభ్య కమిటీ నివేదిక
- లయోల యాజమాన్యానికి షోకాజ్ నోటీసు
- వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో మరోమారు నోటీసు
- తదుపరి చర్యలకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖకు లేఖ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అటానమస్ హోదా లేకపోయినా ఆంధ్రా లయోల కాలేజీ యాజమాన్యం వ్యవహారాలను సాగించిందని, దుర్వినియోగానికి పాల్పడిందని కృష్ణా యూనివర్సిటీ నియమించిన త్రిసభ్య కమిటీ నిర్ధయించింది. దీనికి సంబంధించిన సవివర నివేదికను వర్సిటీ వీసీ శోభన్‌బాబుకు అందించింది. దీంతో ఆంధ్రా లయోల కాలేజీపై తదుపరి చర్యల కోసం రాష్ట్ర ఉన్నత విద్యాశాఖకు వీసీ లేఖ రాశారు.

త్రిసభ్య కమిటీ పరిశీలనలో..

లయోల కాలేజీ యాజమాన్యం అక్రమాలకు పాల్పడుతోందంటూ రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖకు, కృష్ణా యూనివర్సిటీకి ఇటీవల ఫిర్యాదులు వచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఆరా తీయగా, కృష్ణా యూనివర్సిటీ వీసీ త్రిసభ్య కమిటీని నియమించారు. ప్రొఫెసర్లు ఎంవీ బసవేశ్వరరావు, వైకే సుందరకృష్ణ, పి.వీరబ్రహ్మచారితో కూడిన కమిటీ కొద్దిరోజులుగా లయోల కాలేజీ వ్యవహారాలను పరిశీలించింది. లయోల కళాశాల నాక్ గుర్తింపు, యూజీసీ స్వయంప్రతిపత్తి ప్రస్తుత పరిస్థితి, గడువు తర్వాత లయోల కాలేజీలో నిర్వహించిన పరీక్షలు, అకడమిక్ కౌన్సిల్ సమావేశాలు, విద్యా కార్యకలాపాలను ఈ కమిటీ పరిశీలించింది. 2021, అక్టోబరు నుంచి యూజీసీ స్వయంప్రతిపత్తి హోదాను పొందకుండానే పరీక్షలు నిర్వహించడంతో పాటు ఆర్థిక, సాధారణ పరిపాలనా వ్యవహారాల్లో ఉల్లంఘనలకు పాల్పడినట్టుగా గుర్తించారు. దీంతో కాలేజీ యాజమాన్యానికి షోకాజ్ నోటీసు జారీ చేయాల్సిందిగా కమిటీ సూచించింది. ఆ సూచన మేరకు లయోల యాజమాన్యానికి షోకాజ్ నోటీసును జారీ చేసినట్టు వీసీ.. ఉన్నత విద్యాశాఖకు తెలిపారు. ఈ నోటీసుపై కాలేజీ యాజమాన్యం వివరణ ఇచ్చిందని, వాటాదారుల సంక్షేమం కోసం స్వయం ప్రతిపత్తిని కొనసాగించటానికి అనుమతించాలని అభ్యర్థించినట్టు ఆయన తెలిపారు. కళాశాల ఇచ్చిన వివరణపై మరోమారు త్రిసభ్య కమిటీ సమావేశమై తమ సిఫార్సులను అందించిందన్నారు. కాలేజీ యాజమాన్యం ఇచ్చిన వివరణ తమకు సంతృప్తిని కలిగించలేదని, యూజీసీ నిబంధనల ప్రకారం అటానమస్ మిగతా 6లో..

ప్రజాస్వామ్య పరిరక్షణకు యువత క్యూ కట్టారు

- సినీనటుడు పోసాని కర్మఫలం అనుభవిస్తున్నారు
- మంత్రి కొల్లు రవీంద్ర

6లో

కూటమి సహకారంతో విజయం తథ్యం



బాలానందం

నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తన స్వగ్రామైన నిమ్మకూరులో గురువారం సందడిచేశారు. బంధువు ఇంట్లో కొంతసేపు ఉన్న ఆయన స్థానికులతో ముచ్చటించారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై

ప్రొఫెసర్ దాడి

- నాపై ఫిర్యాదు చేస్తావా అంటూ ముఖంపై పిడిగుద్దులు
- కృష్ణా యూనివర్సిటీ వీసీ బాధ్యతలు స్వీకరించిన మర్నాడే ఘటన
- బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణకు ఆదేశించిన వీసీ రాంజీ
- ఆలస్యంగా వెలుగులోకి విషయం

మచిలీపట్నం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): నాపైనే ఫిర్యాదు చేస్తావా అంటూ ఓ ప్రొఫెసర్ మరో అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై దాడికి దిగిన ఘటన కృష్ణా యూనివర్సిటీలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. కృష్ణా యూనివర్సిటీకి నూతన వీసీగా రాంజీ గత ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆ మర్నాడు సోమవారం స్టాఫ్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ప్రొఫెసర్లు, సిబ్బంది ఈ సమావేశానికి హాజరయ్యారు. అనంతరం వీసీ చాంబరుకు సమీపంలో వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ వీరబ్రహ్మచారి ఫార్మసీ విభాగంలో కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ హనుమంతరావుపై దాడికి దిగారు. నాపైనే ఫిర్యాదు చేస్తావా అంటూ వాగ్వివాదం చేస్తూ ముఖంపై పిడిగుద్దులు గుద్దారు. అయితే ఈ విషయం బయటకు రాకుండా ఇద్దరికి సర్దిచెప్పేందుకు కొందరు ప్రొఫెసర్లు మంత్రాంగం నడిపారు. అయినప్పటికీ బాధితుడైన అసిస్టెంట్ ప్రొఫెసర్ హనుమంతరావు వీసీకి ఈ ఘటనపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై వీసీ విచారణ చేయాలని ఆదేశాలు జారీ చేశారని, ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేశామని రిజిస్ట్రార్ శోభన్‌బాబు తెలిపారు. నివేదిక వచ్చాక బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వైభవంగా.. దుర్గానాగేశ్వరుని రథోత్సవం



పురవీధుల్లో కొనసాగుతున్న స్వామివారి రథోత్సవం

మోపిదేవి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : పెదకళ్లేపల్లిలో స్వయంభువుగా కొలువై ఉన్న దుర్గానాగేశ్వరస్వామి వార్షిక కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామివారి రథోత్సవం గురువారం రాత్రి వైభవంగా సాగింది. విశేష అలంకరణతో రథంపై స్వామి, అమ్మవార్లను ఆశీనులను గావించగా, ఆలయ అనువంశిక ధర్మకర్తలైన చల్లపల్లి రాజా వంశీయులు శ్రీమంతు రాజా యార్లగడ్డ శివ రామప్రసాద్, హర్షవర్ధన్ ప్రసాద్, కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. రథం పురవీధుల్లో సాగుతుండగా, భక్తులు, గ్రామస్థులు పసుపు, కుంకుమలు, కొబ్బరికాయలు సమర్పించారు. అవనిగడ్డ డీఎస్పీ టి.విద్యశ్రీ ఆధ్వర్యంలో చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, మోపిదేవి ఎస్ఐ సత్యనారాయణలు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాణాసంచా, కళాకారుల నృత్య ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకుటున్నాయి. ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు ఆధ్వర్యంలో సహాయక ఉద్యోగులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కన్నుల పండుగగా.. దుర్గా, పార్వతీ నాగేశ్వరుల తెప్పోత్సవం

కృత్తివెన్ను, ఫిబ్రవరి 27 : కృత్తివెన్ను దుర్గ పార్వతీ సమేత నాగేశ్వర స్వామి శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం తెప్పోత్సవం కన్నుల పండువగా సాగింది. దుర్గ పార్వతీ సమేత నాగేశ్వరస్వామి, రమా సహిత సత్యనారాయణ స్వామి వార్లను కోనేరులో ప్రత్యేక పుష్పక హంస వాహనంపై భక్తుల హర హర నామస్మరణల మధ్య బాణసంచ కాల్పులతో ఘనంగా ఊరేగించారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఇవో శింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తెప్పోత్సవ కార్యక్రమం అత్యంత వైభవోపేతంగా జరిగింది.



కోనేరులో హంస వాహనంపై దుర్గపార్వతీ సమేత నాగేశ్వరస్వామి, రమాసహిత సత్యనారాయణ స్వామి

ప్రజాస్వామ్య పరిరక్షణకు యువత క్యూ కట్టారు

» సినీనటుడు పోసాని కర్మఫలం అనుభవిస్తున్నారు



» మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్య పరిరక్షణకు నిరుద్యోగ గ్రాడ్యుయేట్లు కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ కట్టారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గురువారం హిందూ కళాశాలలో ఓటువేసిన అనంతరం మంత్రి రవీంద్ర మీడియాతో మాట్లాడారు. గత ఐదేళ్లుగా రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అపహాస్యమైందన్నారు. రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముందుకు వచ్చి ఓటుహక్కును వినియోగించుకుంటున్నారన్నారు. ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల అభ్యర్థుల గెలుపు తథ్యమన్నారు. యువత ఓటు హక్కు వేసేందుకు ముందుకు రావడం ముదావహమన్నారు.

నటుడు పోసాని అరెస్టు తప్పేమీ కాదు..

జగన్‌రెడ్డి దుర్మార్గపు పాలనలో ఇష్టారాజ్యంగా ప్రజలను ఇబ్బంది పెట్టారని, చంద్రబాబుపై వంశీతో పాటు సినీనటుడు పోసాని దుర్భాషలాడారన్నారు. వీరిని అరెస్టు చేయడంలో తప్పులేదన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే వైసీపీ నాయకులు అడ్డగోలుగా మాట్లాడుతున్నారన్నారు. ఎనిమిదివేల బస్తాల పేదల బియ్యం మాయం చేసిన పేర్ని నాని తన వెంట్రుక ఎవరూ పీకలేరని చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. బియ్యం మాయం కేసులో పేర్ని నాని ప్రభుత్వానికి డబ్బులు ఎందుకు చెల్లించాడో సమాధానం చెప్పాలన్నారు. తప్పుచేసిన వారు శిక్ష అనుభవించకతప్పదన్నారు. అరెస్టు భయంతోనే పేర్ని నాని టెన్షన్‌తో ఏదేదో మాట్లాడుతున్నారన్నారు. వల్లభనేని వంశీ, కొడాలి నాని, దేవినేని అవినాష్‌లు అందగాళ్లని జగన్‌రెడ్డి అన్నారని, అయితే తనను పొగడలేదనే బాధతో పేర్నినాని ఉన్నారన్నారు. పేర్నినాని డ్రామాలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. రాజ్యాంగబద్ధంగా పాలించడంతో పాటు ప్రజల శ్రేయస్సే ప్రభుత్వానికి ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. సమావేశంలో లుక్కా సాయిరామ్‌గౌడ్, దేవదత్ తదితరులు మాట్లాడారు.

కూటమి సహకారంతో విజయం తథ్యం

» ఆలపాటి రాజేంద్రప్రసాద్

మచిలీపట్నంటౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కూటమి నేతల సహకారంతో సునాయాసంగా విజయం సాధించనున్నట్టు పట్టభద్రుల అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. గురువారం మచిలీపట్నం హిందూ కళాశాలలో పోలింగ్ సరళిని మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ, వైసీపీ పాలనలో విసుగెత్తిన విద్యావంతులు, నిరుద్యోగ యువత, ఉపాధ్యాయులు, ఉద్యోగులు తనకు ఓటు వేసేందుకు సుముఖత వ్యక్తం చేశారన్నారు. మంత్రి రవీంద్ర, కొనకళ్ల, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ కార్పొరేటర్లు పోలింగ్ సరళిని పరిశీలించారు.



బ్యాలెట్ బాక్సుల తరలింపుపై ఆర్డీవోతో చర్చిస్తున్న కలెక్టర్ బాలాజీ

బ్యాలెట్ బాక్సులకు భద్రత కల్పించండి

» స్ట్రాంగ్‌రూంను సందర్శించిన కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నంటౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): బ్యాలెట్ బాక్సులకు గట్టి భద్రత కల్పించాలని కలెక్టర్ డికె బాలాజీ ఆదేశించారు. గురువారం రాత్రి నోబుల్ కళాశాలకు బందరు డివిజన్ పరిధిలోని వివిధ మండలాలనుంచి 29 పోలింగ్ స్టేషన్‌లనుంచి వచ్చిన బాలెట్ బాక్సులకు గట్టి భద్రత కల్పించాలన్నారు. గుంటూరులోని కౌంటింగ్ కేంద్రానికి బాలెట్ బాక్సులను పంపేందుకు కావలసిని భద్రతపై కలెక్టరు చర్చించారు. మచిలీపట్నం తోపాటు ఉయ్యూరు, గుడివాడ రెవెన్యూ డివిజన్‌ల పరిధిలో జరిగిన ఎన్నికలకు చెందిన బ్యాలెట్ బాక్సులను పంపే కార్యక్రమంపై ఆర్డీవోలతో కలెక్టర్ చర్చించారు.

మంచి సమాజానికి మేము సైతం..



ఓటుహక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యేలు బుద్ధప్రసాద్, వెనిగండ్ల రాము, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య



ఓటు వేసిన ఎమ్మెల్యే యార్లగడ్డ దంపతులు, కలెక్టర్ బాలాజీ



ఓటు హక్కు వినియోగించుకున్న కాగిత కృష్ణ ప్రసాద్ దంపతులు

రెండు కళ్లా చాలవు..

రథంపై ఊరేగిన ఉత్సవమూర్తులు

» ఇంద్రకీలాద్రిపై మహాశివరాత్రి ప్రత్యేక పూజలు



రథోత్సవం సందర్భంగా దుర్గగుడిలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు



ఉత్సవమూర్తుల ఊరేగింపులో ప్రత్యేకాకర్షణగా బేతాళ నృత్యాలు



ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం ప్రత్యేక పూజలు, ఉత్సవమూర్తుల ఊరేగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఉదయం 8 గంటల నుంచి మండప పూజ, మూలమంత్ర హవనం, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగ కార్యక్రమాలు నిర్వహించారు. 9 గంటల నుంచి 4 గంటల వరకు సదస్యం, సాయంత్రం 4.30 గంటలకు ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆది దంపతులు అధిరోహించిన పల్లకీని మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చరణల నడుమ ఈవో, దేవదాయ కమిషనర్ కె.రామచంద్రమోహన్ సమక్షంలో కొండ దిగువ వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు.

కోలాహలంగా రథోత్సవం

మహాశివరాత్రి మరునాడు సాగే రథోత్సవంలో పెద్ద ఎత్తున భక్త జనం పాల్గొని కొలువుదీరిన ఇలవేల్పులకు జేజేలు కొడుతూ పూలు, టెంకాయలు, పండ్లు, తదితరాలను సమర్పించటం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో గురువారం విజయవాడ కెనాల్ రోడ్డులో నుంచి రథోత్సవం కోలాహలంగా సాగింది. భక్తజనుల జయ జయధ్వానాల మధ్య హరోం హర శివ శివ, జై భవానీ, జై జైభవానీ అంటూ నినాదాల మధ్య రథం సాగింది. రథాన్ని పచ్చటి తోరణాలు, వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. దుర్గగుడిలో గంగా, పార్వతీ, మల్లేశ్వరులు, పాత శివాలయంలోని భద్రకాళి, వీరభద్రుడు, భ్రమరాంబ, మల్లేశ్వరుల ఉత్సవమూర్తులు, బుద్ధవారి గుడిలోని వసంత మల్లికార్జునుడు, గంగా, పార్వతీదేవిల ఉత్సవమూర్తులను రథంలో వేదిక పైకి ఉంచి ఉపచారాలు నిర్వహించి హారతులు ఇచ్చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు ఆనవాయితీ మేరకు కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. దేవస్థానం స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ, డిప్యూటీ ఈవో రత్నరాజు, ఇంకా ఏఈవోలు, అధికారులు, భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయ ఈవో నటరాజన్ షణ్ముగం, అధికారులు, అర్చకులు, వసంత మల్లికార్జునస్వామివారి దేవస్థానం (బుద్ధవారి గుడి) ఈవో సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రథోత్సవాన్ని తిలకించారు. పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. కోలాటాలు, నృత్యాలు, పులివేషాలు, తదితరాలు కన్నుల పండువగా సాగాయి. మేళతాళాలు, వేద పఠనాలు రథోత్సవానికి శోభ తెచ్చాయి.

పదిమంది కూడా లేరు!

» కళ తప్పిన ఎలిమెంటరీ బడులు
» విలీన ప్రక్రియతో భవిష్యత్తు ప్రశ్నార్థకం
» 'నాడు-నేడు' పనులు నిరుపయోగం
» విద్యార్థులు లేక భవనాలు వెలవెల
» ఉపాధ్యాయులు, సిబ్బంది వేతనాలు భారం

గత వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల కారణంగా ఎంపీ ఎలిమెంటరీ పాఠశాలల్లో 3, 4, 5 తరగతుల విద్యార్థులను సమీప జడ్పీ పాఠశాలల్లో విలీనం చేయటం వల్ల నేడు ఆ పాఠశాలలు విద్యార్థులు లేక ప్రశ్నార్థకంగా మారాయి. నిత్యం విద్యార్థులతో కళకళలాడే పాఠశాలలు నేడు ముగ్గురు, నలుగురు విద్యార్థులతో వెలవెలబోతున్నాయి. గతంలో 'నాడు-నేడు' పథకం కింద లక్షలాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేసిన పాఠశాలలు నేడు విద్యార్థులు లేకపోవటంతో నిధులు దుర్వినియోగమయ్యాయి.

(కూచిపూడి, ఆంధ్రజ్యోతి)

చినముత్తేవి ఎంపీ ఎలిమెంటరీ పాఠశాలలో 3, 4, 5 తరగతుల విద్యార్థులను సమీపంలోని జడ్పీ పాఠశాలలో విలీనం చేయటంతో ప్రస్తుతం ఆ పాఠశాలలో ముగ్గురు మాత్రమే మిగిలారు. గతంలో పాఠశాలలో 30 మందికిపైగా విద్యార్థులుండేవారు. నిడుమోలు లాకు విద్యార్థులను మంత్రిపాలెం యూపీ పాఠశాలకు విలీనం చేయటంతో నేడు మంత్రిపాలెంలో ముగ్గురు విద్యార్థులు మాత్రమే మిగిలారు. కోసూరు ఎస్‌ఎం పాఠశాల విద్యార్థులను సమీప జడ్పీ పాఠశాల హైస్కూల్‌లో విలీనం చేయటంతో నేడు ఆ పాఠశాలలో నలుగురు విద్యార్థులు మిగిలారు. మొవ్వ పీహెచ్ డబ్ల్యు పాఠశాల విద్యార్థులను సమీపంలోని జెడ్పీ పాఠశాలకు విలీనం చేయటంతో ఈ పాఠశాలలో ఐదుగురు విద్యార్థులు మిగిలారు. మండల పరిధిలోని 10 మందిలోపు విద్యార్థులున్న పాఠశాలలు 10కి పైగానే ఉన్నాయి. విద్యార్థులు ఎంతమంది ఉన్నా వారికి ఉపాధ్యాయుడితోపాటు మధ్యాహ్న భోజనం కోసం వంట మనిషి, టాయిలెట్లు, పాఠశాలను శుభ్రపర్చటానికి అసిస్టెంట్ అవసరం ఉండటం, ఇవి ఆయా పాఠశాలలకు అదనపు భారంగా మారింది. మండలంలో పది మందిలోపు గల పాఠశాలలు ఈ విధంగా ఉన్నాయి. చిన్నముత్తేవి ఏపీలో 8 మంది విద్యార్థులు ఉండగా, ఆవిరిపూడి ఏపీలో ముగ్గురు, ఆవిరిపూడి ఆర్‌లో ఏడుగురు విద్యార్థులు ఉండగా, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. కారకంపాడులో నలుగురు, మట్లమాలపల్లిలో ఏడుగురు, మొవ్వ పాలెంలో నలుగురు, పెదముత్తేవి ఆర్‌లో 9 మంది విద్యార్థులుండగా, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. వీరాయిలంకలో ఐదుగురు, యద్దనపూడిలో ఐదుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. విలీనం చేసిన పాఠశాలలను యథాతథ స్థితికి తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



విద్యార్థులు లేక వెలవెల బోతున్న చినముత్తేవి ఆర్.పాఠశాల



పీతలపై ఆంక్షలా?



నాగాయలంక తీరంలోని మడ అడవుల్లో పీతల వేట చేస్తున్న మత్స్యకారులు



మత్స్యకారుల పీతల బుట్టలను నాగాయలంక తరలిస్తున్న అటవీ అధికారులు

(అవనిగడ్డ-ఆంధ్రజ్యోతి)

అవనిగడ్డ నియోజకవర్గంలో అటవీశాఖాధికారుల తీరుతో నాగాయలంక, కోడూరు మండలాల్లోని మత్స్యకారుల ఉపాధి ప్రశ్నార్థకంగా మారిందని దివి ప్రాంత మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా జిల్లాలో అత్యధికంగా పీతలను ఎగుమతి చేసే నాగాయలంక, కోడూరు మండలాల్లో మత్స్యకారులు వేట సాగించేందుకు పీతల బుట్టలను ఉపయోగిస్తుంటారు. నాగాయలంక, కోడూరు మండలాల్లోని మడ అడవుల పాయలు, సముద్రపు శింకుల్లో బుట్టలను వదిలి అందులోకి పడే పీతలు, చేపలను పట్టుకుని గ్రేడింగ్ చేసి విక్రయించి వందలాది మంది మత్స్యకారులు ఉపాధి పొందుతుంటారు. దశాబ్దాల కాలంగా నాగాయలంక, కోడూరు మండలాల్లోని అగ్నికుల క్షత్రియులు, యానాదులు, వేటపై ఆధారపడి జీవనం సాగించే ఇతర కులాల వారు ఈ విధానంలోనే వేట సాగిస్తుండగా, గడచిన కొద్దికాలంగా బుట్టలు పెట్టి వేట సాగించటానికి వీల్లేదని అటవీశాఖాధికారులు నిర్బంధించటంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

గ్రామానికో రూల్‌గా వేట బుట్టల నిషేధం..

అటవీశాఖాధికారులు బుట్టలు పెట్టి పీతల వేట చేయటంపై ఆంక్షలు విధించిన నేపథ్యంలో కొన్ని గ్రామాల వారిని పనికట్టుకుని అడ్డగిస్తున్నారని దీంతో తాము ఉపాధి కోల్పోతున్నామని నాగాయలంక మండలం ఎదురుమొండి దీవుల్లో పీతల వేటపై ఆధారపడి జీవనం సాగించే పలు కులాల మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం నాచుగుంట సెక్షన్ పరిధిలోని బుట్టలను అటవీశాఖాధికారులు స్వాధీనం చేసుకుని నాగాయలంకకు తరలించారు. జింకపాలెం - నాచుగుంట గ్రామాల నడుమ వేట సాగించే హద్దుల విషయంలో ఏర్పడిన వివాదం పురస్కరించుకుని అటవీశాఖాధికారులు తమ గ్రామంపై కక్ష సాధింపు ధోరణి అవలంబిస్తున్నారని నాచుగుంట బీట్ పరిధిలోని గ్రామాల మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. నాగాయలంక, కోడూరు మండలాల పరిధిలోని సముద్రతీరం మొత్తం బుట్టలు పెట్టి పీతల వేట సాగిస్తుండగా, కేవలం తమ ఒక్క గ్రామాన్ని టార్గెట్ చేయటం పట్ల అధికారులకు ఉన్న ప్రత్యేక ఆసక్తి ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

బుట్టల వేటతో ఫిషింగ్ క్యాట్ మనుగడకు ప్రమాదమా?

బుట్టలు పెట్టి పీతలు వేటాడటం కారణంగా దివి ప్రాంతంలోని మడ అడవుల్లో కనిపించే ఫిషింగ్ క్యాట్ మనుగడకు ప్రమాదం ఏర్పడుతుందని అటవీశాఖాధికారులు పేర్కొంటున్నారు. అయితే గడిచిన రెండు దశాబ్దల కాలంలో ఇలాంటి ఘటన ఒక్కటి కూడా ఈ ప్రాంతంలో నమోదు కాలేదని, కేవలం ఒక్క చోట మాత్రమే పని కట్టుకుని కొందరు చనిపోయిన ఫిషింగ్ క్యాట్‌ను పీతల బుట్టల వద్ద పడేశారని, దానిని చూపించి తమ ఉపాధిపై ఏలా దెబ్బకొడతారని మత్స్యకారులు ప్రశ్నిస్తున్నారు. పీతలు వేటాడే బుట్టకు ఉన్న రంధ్రం ఫిషింగ్ క్యాట్ తల దూరేందుకు సరిపోదని, అలాంటిది ఆ బుట్టలు పెట్టడం ద్వారా ఫిషింగ్ క్యాట్‌కు ప్రమాదం ఎందుకుజరుగుతుందని ప్రశ్నిస్తున్నారు. ప్రతీ ఏటా నాగాయలంక, కోడూరు మండలాల నుంచి కోట్లాది రూపాయల విలువైన పచ్చపీత, ఇతర విలువైన పీత జాతులను పట్టి ఇతర ప్రాంతాలకు, దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. వీటిలో చిన్నసైజు పీతలను స్థానికంగా పీతలు పెంచే చెరువుల వారికి విక్రయిస్తే వారు వాటిని ఎగుమతి సైజు వరకు పెంచి రాష్ట్రానికి ఆదాయాన్ని తీసుకొస్తుంటే అటవీశాఖాధికారులు లేనిపోని అపోహలతో తమ జీవనాధారాన్ని దెబ్బతీస్తున్నారని నాగాయలంక కోడూరు మండలాలకు చెందిన 24 గ్రామాల మత్స్యకారులు ఆరోపిస్తున్నారు.

రూ.50 లక్షల ప్రభుత్వ భూమి కబ్జా!

(5వ పేజీ తరువాయి)

గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. గతేడాది వరకు ఈ భూమిలో వరి పంటను సాగు చేశారు. ప్రభుత్వ భూమిలో పేదలు వరి పంటను సాగు చేస్తుండటంతో అధికారులు అంతగా పట్టించుకోలేదు. ఏకంగా భూమిని ప్లాట్లుగా విభజించి మెరక పనులు చేస్తుండటంతో గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై సౌత్ తహసీల్దార్ పి.మధుసూదనరావును వివరణ కోరగా గ్రామస్తుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి పనులను నిలిపివేశారన్నారు. ఈ భూమి డ్రెయినేజీ పోరంబోకు భూమిగా రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉందన్నారు. భూమి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉన్నతాధికారులకు విషయం తెలియజేశామని చెప్పారు.

అటానమస్ లేకుండానే..

(5వ పేజీ తరువాయి)

కల్పించాలంటే ఒక ఏడాది ముందుగా దరఖాస్తు చేసుకోవాలని, అది జరగలేదన్నారు. దీనిపై మరోమారు లయోల కాలేజీ యాజమాన్యానికి నోటీసు ఇవ్వనున్నట్టు చెప్పారు. అటానమస్ లేకుండా కోర్సులు కొనసాగించడంపై తదుపరి చర్యల కోసం ఆదేశాలు ఇవ్వాలని కోరామన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం

రైల్వే స్టేషన్ : ముస్తాబాద నుంచి గుణదలకు వెళ్లే రైల్వే ట్రాక్ వద్ద మహిళ(40) మృతదేహంను రైల్వే పోలీసులు గుర్తించారు. చిరిగిపోయిన గులాబీ రంగు నైటీతో ఒక చేయి తెగిపోగా, నడుం కింది భాగంలో బలమైన గాయం ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. వివరాలకు 0866-2768630, 9440627544 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	95, 104, 115
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 485

శివరాత్రి ఉత్సవాల్లో విరిగిన ప్రభ

పెనమలూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): యనమలకుదురులో జరుగుతున్న శివరాత్రి ఉత్సవాల్లో స్వల్ప అపశ్రుతి చోటుచేసుకొంది. ఉత్సవాల్లో పాల్గొన్న ఒక ప్రభ సగానికి విరిగి పక్కనే ఉన్న 11కేవీ విద్యుత్ తీగలపై పడింది. ఎన్టీఆర్ బస్‌స్టాప్ వద్ద ఉన్న మసీదు ప్రాంతంలో జరిగిన ఈ ఘటనతో స్థానికులు భయకంపితులయ్యారు. మూడు విద్యుత్ స్థంభాలు పాడవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అప్రమత్తమయిన విద్యుత్ శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన క్రేన్లు తెచ్చి విరిగిన ప్రభను తీయించివేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. యనమలకుదురులో రెండు ప్రభల మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకొంది. పోలీసులు రంగంలోకి దిగి వారిని లాఠీలతో చెదరగొట్టారు. కాసేపటికి వివాదం సద్దుమణిగింది.





ఉయ్యూరులో జడ్జి శ్రీహరి, ఎస్పీ గంగాధరరావు కరచాలనం



బాపులపాడు జడ్పీ హైస్కూల్ పోలింగ్ బూత్‌ను సందర్శించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరంలో చిన్నారితో..



బాపులపాడులో వీల్ చైర్‌లో మహిళ



పోలింగ్ స్టేషన్ సమీపంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కదిలొచ్చిన పట్టభద్రులు

గన్నవరం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగింది. గన్నవరం మండలంలో 3528 మందికి గాను 2482 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 70.35శాతం నమోదైంది. ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ 13.36శాతం, 12గంటలకు 34.84 శాతం, 2గంటల వరకూ 53.49 ఓటింగ్ సరళి ఉంది. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జ్ఞానేశ్వరీ దంపతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. గుడివాడ ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, తహసీల్దార్ కేవీ శివయ్య, డీఎస్పీ చలసాని శ్రీనివాసరావులు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

విజయవాడ రూరల్ మండలంలో 58 శాతం

విజయవాడ రూరల్: విజయవాడ రూరల్ మండలం నున్నలో గురువారం హైస్కూల్‌లో రెండు పోలింగ్ బూత్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. మొత్తం 58 శాతం ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు.

హనుమాన్‌జంక్షన్ మండలంలో 72.5

హనుమాన్‌జంక్షన్/ హనుమాన్‌జంక్షన్ రూరల్: మండలంలో 2,628మందికి గాను 1906మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 72.5శాతం నమోదైంది. అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ బి.మురళీకృష్ణ పర్యవేక్షణలో పోలింగ్ బూత్ 126,127,128లకు బాపులపాడు హెచ్ఎం టీవీ.నాగేశ్వరరావు, ఎంపీడీవో ఏవో త్రినాథ రావు, అగ్రికల్చర్ ఏవో భవానిలు పోలింగ్ ఆఫీసర్లుగా వ్యవహరించారు. మూడు బూత్‌లకు సెక్టార్ ఆఫీసర్‌గా బాపులపాడు ఈవోపీఆర్డీ కె.లక్ష్మయ్య వ్యవహరించారు. ఓటు హక్కును వినియోగించుకున్న వారిలో విశ్వహిందూ పరిషత్ జాతీయ ట్రస్టీ పుట్టగుంట సతీష్‌కుమార్, నాగార్జునసాగర్ ఎడమ కాల్వ వీసీ వైస్‌చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, టీడీపీ తెలుగు మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కల్యాణి, చెరుకు రైతు సంఘం నాయకుడు నందూరు సత్యవెంకటేశ్వరశర్మ ఉన్నారు.

ప్రజాస్వామ్యానికి తలమానికం ఓటు

హనుమాన్‌జంక్షన్: బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే యార్లగడ్డవెంకట్రావు సందర్శించారు. పోలింగ్ బూత్‌లను పరిశీలించి ఓటింగ్ సరళిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి తలమానికంగా ఉన్న ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. బాపులపాడులో నిర్వహించిన పోలింగ్‌లో రంగన్నగూడెం నుంచి 92శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు నాగార్జున సాగర్ ఎమడ కాలువ వీసీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ తెలిపారు.

ఉయ్యూరులో 71.62..

ఉయ్యూరు: ఉయ్యూరులో 71.62 శాతం ఓట్లుపోలయ్యాయి. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా ఉయ్యూరు, మండలపరిధిలో 2,805 మందికి 2009 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఉయ్యూరు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీహరి తన ఓటుహక్కు వినియోగించు కున్నారు. ఎస్పీ ఆర్.గంగాధరరావు ఓటింగ్ ప్రక్రియ పరిశీలించారు. ఆర్డీవో హేలాషారోన్ పోలింగ్ సరళిని తహసీల్దార్ సురేశ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. సీఐ రామారావు, ఎస్సై విశ్వనాథ్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

కంకిపాడులో 72 ...

కంకిపాడు: 72 శాతం పోలింగ్ జరిగిందని అధికారులు తెలిపారు. ఉదయం ఎన్నిల ప్రక్రియను ఎస్పీ గంగాధర్ పరిశీలించారు. రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను పరిశీలించారు. వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

పెనమలూరులో 68.19శాతం

పెనమలూరు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు తాడిగడప మునిసిపాలిటీ పోరంకి ఉన్నత పాఠశాలలో ఎనిమిది బూత్‌లను, పెనమలూరు ఉన్నత పాఠశాలలో మూడు బూత్‌లను ఏర్పాటు చేశారు. రూరల్ ఓటర్లు పెనమలూరు ఉన్నత పాఠశాలలో, పట్టణ ప్రాంత ఓటర్లు పోరంకి ఉన్నత పాఠశాలలో ఓటుహక్కును వినియోగించుకొన్నారు. మండలంలో 10594మంది ఓటర్లు ఉండగా 7225 మంది ఓటుహక్కును వినియోగించుకొన్నారు. 68.19శాతం ఓటింగ్ నమోదయినట్లు అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కూటమి నాయకులతో కలిసి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి పోరంకి పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటింగ్ సరళిని పరిశీలించారు. టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి గొట్టిపాటి వెంకట రామకృష్ణప్రసాద్ ఓటు హక్కును వినియోగించుకొని పోలింగ్ బూత్‌ల వద్ద పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు.

ఉంగుటూరులో 68.07శాతం

ఉంగుటూరు: ఏఈఆర్‌వో, తహసీల్దార్ జాలాది విమలకుమారి పర్యవేక్షణలో పోలింగ్ జరిగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు.

ఉంగుటూరు జడ్పీహైస్కూల్‌లోని 129, 130 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 1234 ఓట్లకు గాను 840 ఓట్లు(68.07శాతం)పోలయ్యాయని ఏఈఆర్‌వో, తహసీల్దార్ జె.విమలకుమారి తెలిపారు. దివ్యాంగులు, వృద్ధులు, బాలింతలు, తల్లులు ఎండను సైతం లెక్క చేయకుండా చంటిపిల్లలను ఎత్తుకుని ఓటుహక్కును వినియోగించుకున్నారు.

గుడివాడ ఆర్డీవో తనిఖీ

ఉంగుటూరు : ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం స్థానిక జడ్పీహైస్కూల్‌లో ఏర్పాటుచేసిన రెండు పోలింగ్ కేంద్రాలను తనిఖీచేశారు. కాగా ఉంగుటూరులో జరుగుతున్న పోలింగ్ పరిశీలనకు వచ్చిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పోలింగ్ కేంద్రాలకు 200మీటర్ల దూరంలో టెంట్లు వేసుకుని కూర్చొని ఓటర్లకు స్లిప్‌లు పంపిణీ చేస్తున్న సిబ్బందితో మాట్లాడి పోలింగ్ ఎలా జరుగుతున్నదని ఆరా తీసి వెళ్లారు.

గెలుపు కూటమి అభ్యర్థిదే...

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గెలుపు ఖాయమని మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపర్చిన అభ్యర్థి గెలుపు సునాయాసమన్నారు. ఈ జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు సుదిమళ్ల రవీంద్ర, టీడీపీ నాయకులు పులి శ్రీనివాసరావు, కొండా నాగేశ్వరరావు, వణుకూరు విక్రం, రాజ, జనసేన పార్టీ ప్రచార కమిటీ జిల్లా కోఆర్డినేటర్ పులికామేశ్వరరావు, బోయిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బారులు తీరిన మహిళా ఓటర్లు



పెనమలూరు పోలింగ్ బూత్ వద్ద ఓటర్లకు స్లిప్‌లు అందజేస్తున్న టీడీపీ నాయకులు



ఉయ్యూరులో ఆర్డీవో హేలా షారోన్

రక్తదానం ప్రాణదానంతో సమానం

గన్నవరం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు బాపట్ల రవికుమార్ అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల బోధనాస్పత్రిలో జంగారెడ్డిగూడెంకు చెందిన రాపాక సౌజన్య గుండె సంబంధిత వ్యాధితో జాయిన్ అయ్యింది. ఆమెకు ఓ పాజిటివ్ బ్లడ్ అవసరం కాగా కేసరపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులను ఆశ్రయించారు. పిల్లి సునీల్, బాపట్ల సురేష్, అంబటి రత్న కిరణ్‌లు గురువారం ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశారు. సౌజన్య తల్లిదండ్రులు ముగ్గురు యువకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కన్నుల పండువగా శివపార్వతుల శాంతి కల్యాణం



పెరికీడు ముక్తి కాంతసమేత ముక్తేశ్వరస్వామి శాంతి కల్యాణం



బాపులపాడు శివాలయంలో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):. పెరికీడులోని పంచాయతన క్షేత్రమైన శ్రీముక్తి కాంతా సమేత ముక్తేశ్వరస్వామి ఆవరణలో బుధవారం రాత్రి శాంతి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. అర్చకులు సీతారామయ్య, వేణు, శ్యామ్‌ల ఆధ్వర్యంలో వేద మంత్రాల మధ్య మంగళవాయిద్యాలతో శాంతి కల్యాణం నిర్వహించారు. 24మంది పుణ్యదంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. ఆలయకమిటీ సభ్యులు నండూరి సత్యవెంకటేశ్వరశర్మ, కొల్లిమర్ల వెంకట రంగారావు, నక్కా బాబు, శ్రీనివాస్, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా శాంతి కల్యాణోత్సవం

హనుమాన్‌జంక్షన్: బాపులపాడు ధర్మకోనేరు శ్రీ భ్రమరాంబిక సమేత శ్రీశైలమల్లికార్జున స్వామి ఆలయంలో బుధవారం రాత్రి శివపార్వతుల శాంతి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు బాదంపూడి అరుణ్‌కుమార్ పర్యవేక్షణలో పలువురు అర్చకులు కల్యాణం జరిపారు. గురువారం స్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ గూడవల్లి చిన్నా, వైస్ చైర్మన్ కొల్లి వెంకట్రావు, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వెంకయ్యస్వామికి గ్రామోత్సవం

స్థానిక ఏలూరు రోడ్డులోని శ్రీ వెంకయ్యస్వామి ఆలయంలో బుధవారం రాత్రి శ్రీగోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామికి కల్యాణోత్సవం వేడుకగా ఆలయంలో నిర్వహించి అనంతరం జంక్షన్, అప్పనవీడు గ్రామాల్లో గ్రామోత్సవం జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కొత్తల శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు నడకుదురు సత్యనారాయణ, సంభోజు శివ, మట్టాశ్రీను, వనమోజు రవిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 400 మందికి అన్నసంతర్పన చేశారు.

రెండు వేర్వేరు కేసుల్లో ముద్దాయిలకు శిక్ష

ఉంగుటూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఇందుపల్లి శివారు జంధ్యాలవారి కండ్రికలో పొలం దారి విషయంలో జరిగిన గొడవలో ముద్దాయిలకు కోర్టు జైలుశిక్ష విధించింది. ఉంగుటూరు ఎస్సై యు.గోవిందు తెలిపిన వివరాల ప్రకారం పొలం దారి విషయమై జరిగిన గొడవలో గ్రామానికి చెందిన కొమ్మా నాగరాజు అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు మూకుమ్మడిగా దాడిచేసి కొట్టారు. కొమ్మా నాగరాజు ఇచ్చిన ఫిర్యాదుతో 2021లో అప్పటి ఎస్సై రాజు కేసు నమోదుచేశారు. దర్యాప్తు అనంతరం నిందితులను గన్నవరం కోర్టులో హాజరుపర్చగా ఏపీపీ టి.మాధవీలత వాదనలను వినిపించారు. నేరం రుజువుకావడంతో జడ్జి బి.శిరీష ముద్దాయిలకు ఒక్కొక్కరికి 18నెలల జైలుశిక్ష, వెయ్యిరూపాయల జరిమానా విధించారు.

కొడుకుకు రూ.7వేలు జరిమానా

పెంచి పెద్దచేసిన కుమారుడు ఆస్తి విషయమై గొడవపడుతూ శారీరకంగా హింసిస్తున్నాడని లంకపల్లికి చెందిన గంటా సంజీవరావు 2023లో పోలీసులకు ఫిర్యాదు చేశాడు, సదరు వ్యక్తి రిపోర్టుపై అప్పటి ఎస్సై రాజు కేసు నమోదుచేశారు. దర్యాప్తు అనంతరం నిందితుడిని గన్నవరం కోర్టులో హాజరుపర్చగా జడ్జి ముద్దాయికి రూ.7వేలు జరిమానా విధించారు.

ఆకట్టుకున్న లింగోద్భవకాలం సాంస్కృతిక కార్యక్రమాలు



మహిళల కోలాటం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి ఉత్సవాలు బుధవారం అర్ధరాత్రి వరకూ జరిగిన లింగోద్భవ అభిషేక పూజలతో ముగిశాయి. మడిచర్లలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామికి అన్నాభిషేకం, రాత్రి 11గంటలకు లింగోద్భవ అభిషేకపూజలు అర్చకులు సుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ పర్యవేక్షణలో శివరాత్రి జాగరణ సందర్భంగా మహిళలు స్వామికి కోలాటనృత్య నీరాజనం అర్పించారు. కానుమోలులోని శ్రీగంగాబాలత్రిపుర సుందరీదేవి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు పవన్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేక పూజల్లో మహిళలు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

వైభవంగా రామలింగేశ్వరస్వామి ఊరేగింపు

ప్రసాదంపాడు: శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ తల్లి ఉపాలయమైన శ్రీ గంగ పార్వతి సమేత రామలింగేశ్వర స్వామివారి కల్యాణోత్సవం అనంతరం ఉత్సవ విగ్రాహాల ఊరేగింపు రామవరప్పాడు పురవీధుల్లో గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.ప్రియాంక, కోలా ఆనంద్, సాయిరామరాజు, నబిగాని కొండ, భక్తులు పాల్గొన్నారు.



గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఊరేగింపు

ఆలపాటి గెలుపు ఖాయం: బండ్రెడ్డి రామకృష్ణ

పామర్రు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరచిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు ఖాయమని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ అన్నారు. స్థానిక హైస్కూల్లో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని జనసేన పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కారణంగా ఆలపాటి అఖండ విజయంతో గెలవడం ఖాయమని అన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, కృష్ణాడెల్టా వైస్‌చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, కూటమిశ్రేణులు బండ్రెడ్డి రామకృష్ణతో ఉన్నాయి.



గుడ్లవల్లేరులో ఓటింగ్ సరళిని తెలుసుకుంటున్న గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు





నందివాడ, గుడ్లవల్లేరులో బారులు తీరిన ఓటర్లు

గుడివాడ నియోజకవర్గంలో.. 68.95 శాతం పోలింగ్

గుడివాడ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గవ్యాప్తంగా 68.95 శాతం పోలింగ్ నమోదయిందని ఎన్నికల అధికారులు ప్రకటించారు. గుడివాడ, గుడివాడ రూరల్ మండలంలో 7,865 ఓటర్లకు 5314 మంది ఓటేశారు. 67.57 శాతం పోలింగ్ నమోదయింది. గుడ్లవల్లేరు మండలంలో రెండు పోలింగ్ కేంద్రాల్లో 1,481 ఓటర్లకు 1,073 మంది ఓటేశారు. 72.45 శాతం పోలింగ్ నమోదయింది. నందివాడలో ఒక్క పోలింగ్ కేంద్రంలో 881 మంది ఓటర్లకు 665 మంది ఓటేయగా 75.48 శాతం పోలింగ్ నమోదయింది. అధికారులు పోలింగ్ సందర్భంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ ధీరజ్ వినీల్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎన్నికల విధుల్లో ఉన్న వారికి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వైద్యశిబిరం నిర్వహించారు.

ఓటేసిన ప్రముఖులు

ఎస్పీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

ఏజేకే పాఠశాలలో..

గుడివాడ రూరల్: మండలంలోని పట్టభద్రులు, ఉద్యోగులు గుడివాడలోని ఏజేకే పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. దొండపాడు, మోటూరు, చౌటపల్లి, బొమ్ములూరు, లింగవరం గ్రామాలకు చెందిన ఓటర్లు ఓట్లేశారు.

పోలింగ్ సరళి పరిశీలన

నందివాడ: పోలింగ్ కేంద్రం వద్ద అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్సై కె.శ్రీనివాస్ బందోబస్తు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ఎమ్మెల్సీ ఓట్లు సందడిగా ప్రారంభం కాగా, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నందివాడ పోలింగ్ కేంద్రం వద్ద పోలింగ్ తీరును పరిశీలించారు.

169, 170 పోలింగ్ బూత్‌లలో..

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎం హైస్కూల్ ఆవరణలోని 169, 170 పోలింగ్ బూత్‌లలో పోలింగ్ నిర్వహించారు. గుడ్లవల్లేరుకు చెందిన చాపరాల రాకేష్, మోనిక దంపతులు అమెరికాలో ఉంటున్నారు. వారు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఇక్కడికి వచ్చారు. గుడ్లవల్లేరులో వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు ఓటింగ్ సరళిని తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శిబిరం వద్ద కార్యకర్తలు, నాయకులను కలిసి మాట్లాడారు.



గుడ్లవల్లేరులో ఓటు వేసేందుకు వీల్‌చైర్‌లో వెళుతున్న వృద్ధుడు

పామర్రు నియోజకవర్గంలో 71.8 శాతం



పమిడిముక్కల హైస్కూల్‌లో ఓటేసేందుకు బారులు తీరిన ఓటర్లు



పామర్రులో ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న ఎస్పీ గంగాధరరావు

పామర్రు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 6,447 మంది ఓటర్లకు 4,628 మంది ఓటేశారని 71.8 శాతం పోలింగ్ నమోదయిందని ఎన్నికల అధికారి, ఉయ్యూరు ఆర్డీవో షారోన్ తెలిపారు. ఐదు మండలాల్లో గురువారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గంలో తొమ్మిది పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటల నుంచి ఓటర్లు బారులు తీరారు. ఓటర్లకు అసౌకర్యం కలగకుండా ఆర్డీవో షారోన్ ఆధ్వర్యంలో తహసీల్దార్లు జి.రవికాంత్, మస్తాన్, రంగారావు, కుసుమకుమారి, ఎన్నికల డీటీ రజనీకాంత్ ఏర్పాట్లు చేశారు. పోలింగ్ బూత్‌లను ఎస్పీ గంగాధర్‌రావు, గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. సంతృప్తి వ్యక్తంచేశారు.

మండలాల వారీగా..

పామర్రు/పెదపారుపూడి/కూచిపూడి/తోట్లవల్లూరు/పమిడిముక్కల: పామర్రు మండలంలో మొత్తం ఓటర్లు 1,766 మందికి 1,305 పోలయ్యాయని, పోలింగ్ శాతం 73.9గా నమోదయిందని తహసీల్దార్ రవికాంత్ తెలిపారు.

- పెదపారుపూడి మండలంలో మొత్తం ఓటర్లు 823 మంది. ఓటేసింది 564 మంది. పోలింగ్ శాతం 68.53
- తోట్లవల్లూరు మండలంలో మొత్తం ఓటర్లు 1,312, ఓటేసింది 923. పోలింగ్ శాతం 70.4.
- మొవ్వ మండలంలో మొత్తం ఓటర్లు 1,259, ఓటేసింది 882. పోలింగ్ శాతం 70.05.
- పమిడిముక్కల మండలంలో మొత్తం ఓటర్లు 1,287, పోలయినవి 954. పోలింగ్ శాతం74.

మొవ్వ మండలంలో

కూచిపూడి: మొవ్వ జడ్పీ పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించారు. తహసీల్దార్ కె.మస్తాన్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్, పామర్రు సీఐ వి.శుభాకర్, కూచిపూడి ఎస్సై ఎం.సుబ్రహ్మణ్యం బందోబస్తు ఏర్పాట్లు చేసి పరిస్థితిని సమీక్షించారు. ఎన్నికలు జరిగే ప్రాంతంలో 144 సెక్షన్ అమలు చేసి సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూశారు. రెండు బూత్‌లలో నలుగురు పీవోలు, నలుగురు ఏపీవోలు, ఇద్దరు మైక్రో అబ్జర్వర్లు విధులు నిర్వహించారు.

పది గంటల వరకు నిదానంగానే..

పెదపారుపూడి: పెదపారుపూడిలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బూత్ నెంబరు 150లో పోలింగ్ నిర్వహించారు. ఉదయం 10 గంటల వరకు పోలింగ్ నిదానంగా సాగింది. ఓటర్లు చాలామంది తమ విధి నిర్వహణకు వెళ్తూ ఓటేయడానికి వచ్చారు. క్యూలలో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు జడ్పీ హైస్కూల్లో నిర్వహించిన ఎన్నికల్లో 923 ఓట్లు పోలయినట్టు తహసీల్దార్ ఎం.కుసుమకుమారి తెలిపారు. 145 బూత్‌లో 528, 146 బూత్‌లో 395 ఓట్లు పోలయ్యాయన్నారు. సీఐ వై.చిట్టిబాబు, ఎస్సై సీహెచ్ అవినాష్ బందోబస్తు నిర్వహించారు. గౌడ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, టీడీపీ మండల అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్, పలువురు టీడీపీ నాయకులు పర్యటించి ఎన్నికల సరళిని తెలుసుకున్నారు. చాలామంది పట్టభద్రుల ఓటర్లు డబ్బుల కోసం ఎదురు చూశారు. ఎవ్వరూ పంపిణీ చేయకపోవటంతో కొందరు ఓటేసేందుకు నిరాశక్తత చూపారు.



పెదపారుపూడిలో దివ్యాంగుడిని వీల్ చైర్‌లో తీసుకెళ్తున్న తహసీల్దార్ వై.రంగారావు



ఓటేసిన ప్రముఖులు

పామర్రు: పామర్రులో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 163 పోలింగ్ బూత్‌లో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య తన కుటుంబసభ్యులతో కలిసి ఓటేశారు. మాజీ ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన 162 కేంద్రంలో ఓటేశారు.

పామర్రులో ఓటు హక్కు వినియోగించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన



మొవ్వలో పరిస్థితిని సమీక్షిస్తున్న తహసీల్దార్ మస్తాన్, డీఎస్పీ ధీరజ్ వినీల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

కేఎస్ లక్ష్మణరావుకు పరాభవం తప్పదు

● నియోజకవర్గంలో ఆయనకు 20 శాతం ఓట్లయినా రావు: ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు మంచి చేసేది కూటమి ప్రభుత్వమని, పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు భారీగా ఓట్లు వేశారని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గురువారం టీడీపీ పాత కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో నియోజకవర్గంలో 68.95శాతం పోలింగ్ నమోదవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ ముసుగులో ఉన్న పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు పరాభవం తప్పదని ఆయన విమర్శించారు. నియోజకవర్గంలో లక్ష్మణరావుకు 20శాతం ఓట్లు కూడా రావన్నారు. పట్టభద్రులంతా ఏకపక్షంగా కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా నిలిచారన్నారు. తొమ్మిది నెలల కూటమి ప్రభుత్వంపై పట్టభద్రులు నమ్మకం ఉంచారన్నారు. దుర్భరమైన పరిస్థితుల్లో ఉన్న రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు గాడిన పెడుతున్నారన్నారు. పరిశ్రమల స్థాపనకు పెద్దపీట వేస్తున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధికి నిధులు, అమరావతి, పోలవరం నిర్మాణానికి కృషి చేస్తున్నారన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గోనుగుంట్ల కోటేశ్వరరావు, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకురాలు నూకాలమ్మను ఎమ్మెల్యే సత్కరించారు. ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గోకవరపు సునీల్, నాయకులు సత్యనారాయణ, అల్లాడ శ్రీనివాసరావు, అడుసుమిల్లి శ్రీనివాసరావు, షేక్ జానీ, బాజీఖాన్, వీరయ్య, రబ్బానీ, షేక్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

పామర్రులో ఓటింగ్ సరళిని పరిశీలించిన ఆలపాటి, బండ్రెడ్డి





పామర్రులో ఓటింగ్‌సరళిని పరిశీలిస్తున్న కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ

తోట్లవల్లూరులో..



తోట్లవల్లూరు బూత్‌లో ఓటేస్తున్న ఓటర్లు



ఎన్నికల సరళిని తెలుసుకుంటున్న వీరంకి గురుమూర్తి, శిరామ్‌ప్రసాద్

నేత్రపర్వం.. దుర్గానాగేశ్వరస్వామి కల్యాణం

మోపిదేవి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పెదకళ్లేపల్లిలో దుర్గానాగేశ్వరస్వామి కల్యాణం గురువారం తెల్లవారుజామున నేత్రపర్వంగా జరిగింది. అర్చకులు, గ్రామస్థులు, దేవదాయశాఖ ఉద్యోగులు ఎదుర్కోలు ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన సింహవాహనంపై స్వామి, అమ్మవార్లను ఆశీనులను గావించారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలైన చల్లపల్లి రాజా వంశీయులు యార్లగడ్డ శివరామప్రసాద్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణ మహోత్సవాన్ని ప్రారంభించారు. ప్రధాన అర్చకుడు బుద్ధు నాగవరప్రసాద్ ఆధ్వర్యంలో అర్చక బృందం వేదమంత్రోచ్చరణల నడుమ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. మంగళసూత్రాలను అర్చకులు ప్రదర్శించగా, భక్తులు కన్నులారా వీక్షించారు. మంగళసూత్రధారణ అనంతరం ముత్యాల తలంబ్రాల కార్యక్రమాన్ని చల్లపల్లి రాజా వంశీయులు సంప్రదాయబద్ధంగా ప్రారంభించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను విశేష అలంకరణ చేసి నందీవాహనంపై పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఈవో దాసరి శ్రీరామవర ప్రసాదరావు ఆధ్వర్యంలో ఎస్టేట్ దేవాలయాల ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.



మంగళసూత్రాలను భక్తులకు చూపుతున్న అర్చకులు

జనసేన సభకు రాజానగరం సమన్వయకర్తగా

బూరగడ్డ శ్రీకాంత్

గుడివాడ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో మార్చి 14వ తేదీన నిర్వహించే జనసేన ఆవిర్భావ సభకు రాజానగరం నియోజకవర్గ సమన్వయకర్తగా గుడివాడ జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ నియమితులయ్యారు. గురువారం స్థానిక జనసేన నియోజకవర్గ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజానగరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, స్థానిక నాయకులతో కలిసి ఆవిర్భావ సభను విజయవంతం చేయడానికి కృషి చేస్తానన్నారు. రాజానగరం నుంచి జనసేన కార్యకర్తలను పెద్ద సంఖ్యలో ఆవిర్భావ సభకు తరలించి విజయవంతం చేస్తామన్నారు. తనను సమన్వయకర్తగా నియమించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ హరిప్రసాద్‌లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. పలువురు నాయకులు, వీరమహిళలు బూరగడ్డను అభినందించారు.

శివరాత్రి ఉత్సవాల్లో విరిగిన ప్రభ

పెనమలూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): యనమలకుదురులో జరుగుతున్న శివరాత్రి ఉత్సవాల్లో స్వల్ప అపశ్రుతి చోటుచేసుకుంది. ఉత్సవాల్లో పాల్గొన్న ఒక ప్రభ సగానికి విరిగి పక్కనే ఉన్న 11కేవీ విద్యుత్ తీగలపై పడింది. ఎన్టీఆర్ బస్టాప్ వద్ద ఉన్న మసీదు ప్రాంతంలో జరిగిన ఈ ఘటనతో స్థానికులు భయకంపితులయ్యారు. మూడు విద్యుత్ స్తంభాలు పాడవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అప్రమత్తమయిన విద్యుత్ శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన క్రేన్లు తెచ్చి విరిగిన ప్రభను తీయించివేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. యనమలకుదురులో రెండు ప్రభల మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకొంది. పోలీసులు రంగంలోకి దిగి వారిని లాఠీలతో చెదరగొట్టారు. కాసేపటికి వివాదం సద్దుమణిగింది.

శరవేగంగా ఆక్విడెక్ట్ మరమ్మతులు

అవనిగడ్డ రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): దివిసీమకు జీవనాడి పులిగడ్డ ఆక్విడెక్ట్ మరమ్మతు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కొత్త రెయిలింగ్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఇరిగేషన్ డీఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పనులు నిర్వహిస్తున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

గన్నవరం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు బాపట్ల రవికుమార్ అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల బోధనాస్పత్రిలో జంగారెడ్డిగూడెంకు చెందిన రాపాక సౌజన్య గుండె సంబంధిత వ్యాధితో జాయిన్ అయ్యింది. ఆమెకు ఓ పాజిటివ్ బ్లడ్ అవసరం కాగా కేసరపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులను ఆశ్రయించారు. పిల్లి సునీల్, బాపట్ల సురేష్, అంబటి రత్న కిరణ్‌లు గురువారం ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశారు. సౌజన్య తల్లిదండ్రులు ముగ్గురు యువకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కోలాటం గురువులకు ఆర్థిక సాయం

చల్లపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన కళలు కనుమరుగవుతున్న నేపథ్యంలో కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చల్లపల్లి ఉపసర్పంచ్ ముమ్మనేని నాని అన్నారు. చల్లపల్లికి చెందిన శాఖాంబరి మురళీకృష్ణ భక్తసమాజం (కోలాటం) కళాకారులకు రూ.10 వేలు ప్రోత్సాహక సహాయాన్ని గురువారం నాని అందజేశారు. కొత్తతరం కళాకారులను తయారుచేస్తున్న కోలాటం గురువు వేముల అంకంబొట్లును అభినందించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొక్కిలిగడ్డ మణిప్రభాకరరావు, వార్డుసభ్యుడు అంబటి భువనేశ్వరరావు, టీడీపీ నేత వేముల హరికృష్ణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధ దంపతులు బళ్లా కామేశ్వరరావుకు ఉపసర్పంచ్ నాని రూ.5 వేలు సహాయంగా అందజేశారు. వార్డుసభ్యుడు బళ్లా వాసు ద్వారా విషయం తెలుసుకుని సాయం అందించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	95, 104, 115
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.485

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై లోకాయుక్త ఆదేశం

అవనిగడ్డ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ పంచాయతీ షాపింగ్ కాంప్లెక్సు అద్దెల నిధులు దుర్వినియోగంపై వెంటనే నివేదిక సమర్పించాలని లోకాయుక్త జస్టిస్ పి.రజని జిల్లా పంచాయతీ అధికారికి ఆదేశాలు జారీ చేశారని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస గౌడ్ తెలిపారు. షాపింగ్ కాంప్లెక్స్ అద్దెలకు సంబంధించి 8.09 లక్షల నిధులు దుర్వినియోగమయ్యాయని లోకాయుక్తలో కేసు వేయగా, వెంటనే దీనిపై నివేదిక సమర్పించాలని లోకాయుక్త ఈ నెల 24వ తేదీన ఆదేశాలు జారీ చేసినట్లు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.



హైనీ హైస్కూల్‌లో ఓటు వేస్తున్న ఆర్డీవో కె.స్వాతి, ఓటు వేసిన కమిషనర్ బాపిరాజు, పోలింగ్ కేంద్రాలను సందర్శిస్తున్న ఎస్పీ గంగాధరరావు, ఏఎస్పీ సత్యనారాయణ, డీఎస్పీ విద్యశ్రీ పెడనలో ఓటింగ్ సరళి తెలుసుకుంటున్న కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్

గ్రాడ్యుయేట్ల స్పందన భేష్

- ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన యువత
- చంటి బిడ్డలతో తరలివచ్చిన మహిళలు
- ఓటేసిన దివ్యాంగులు
- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ, ఏఎస్పీ, డీఎస్పీలు
- పోలింగ్ సరళిని సమీక్షించిన ఆలపాటి, మండలి, కొనకళ్ల తదితరులు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్‌కు గ్రాడ్యుయేట్ల నుంచి మంచి స్పందన లభించింది. గ్రాడ్యుయేట్ ఓటర్లలో దివ్యాంగులు, బాలింతలు చంటిబిడ్డలతో తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. హైనీ హైస్కూలులోని పోలింగ్ కేంద్రంలో కలెక్టర్ డీకే బాలాజీ, బందరు ఆర్డీవో కె.స్వాతి, మునిసిపల్ కమీషనరు బాపిరాజు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎస్పీ గంగాధరావు హిందూ కాలేజ్, సెయింట్ ఫ్రా న్సిస్ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. గుంటూరులోని లెక్కింపు కేంద్రానికి బ్యాలెట్ బాక్సులను తీసుకువెళ్లేందుకు ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. ఎస్పీతో పాటు సీఐ నబి తదితరులు ఉన్నారు. **పెడన** : పట్టభద్రుల నియోజక వర్గ ఎన్నికల పోలింగ్ భట్ట జ్ఞానకోటయ్య జడ్పీ హైస్కూల్‌లో ప్రశాంతంగా జరిగింది. 82 శాతం పోలింగ్ నమోదయింది. ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ పోలింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్‌పై కూటమి నాయకులు బొడ్డు వేణుగోపాలరావు, యక్కల శ్యామలయ్య, వహబ్‌ఖాన్, శలపాటి ప్రసాద్, అర్జా వెంకట నగేష్, శీరం ప్రసాద్, మట్టా శివపావని, వరుదు రామకృష్ణ, బళ్ళ మల్లిఖార్జునప్రసాద్, అనుముల పూర్ణ తదితరులతో చర్చించారు. ఇన్‌ఛార్జి తహసీల్దార్ కూనపరెడ్డి అనిల్‌కుమార్, ఏఎస్పీ బి. సత్యనారాయణ, డీఎస్పీ చప్పిడి రాజా బందోబస్తు పర్యవేక్షించారు. **గూడూరు** : కృష్ణా గుంటూరు పట్టభద్రుల స్థానానికి గురువారం గూడూరు హైస్కూల్‌లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో మొత్తం 946 మంది ఓటర్లు ఉండగా 723 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారిలో పురుషులు 448 మంది కాగా, మహిళలు 275 మంది ఉన్నారు. మం డలంలో 76.4 శాతం ఓట్లు పోలయ్యాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. **కృత్తివెన్ను** : మండలంలో 815 మంది పట్టభద్రులకు గాను సంగమూడి హైస్కూల్ పోలింగ్ బూత్‌లో 604 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ శాతం 70.43గా నమోదయ్యిందని ఆర్వో సముద్రవేణి తెలిపారు. **మోపిదేవి** : మండలంలో 73.23 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ ఎం.శ్రీవిద్య తెలిపారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి అభ్యర్థిగా పోటీ చేసిన ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు మోపిదేవి విచ్చేసి స్థానిక పార్టీ నాయకులతో పోలింగ్ సరళిని పరిశీలించారు. **బంటుమిల్లి** : మండలంలోని బంటుమిల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. రెండు పోలింగ్ కేంద్రాలలో 1321 ఓట్లకు గాను 981 ఓట్లు పోల్ అయ్యాయి. 74.26 శాతం నమోదు అయ్యింది. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాదు కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. **అవనిగడ్డ** : ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ అవనిగడ్డ నియోజకవర్గంలో ప్రశాంతంగా జరిగింది. నియోజకవర్గ వ్యాప్తంగా 68.98 శాతం పోలింగ్ నమోదుకాగా, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ బూత్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. **నాగాయలంక**: నాగాయలంకలో ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ ఓటింగ్ సరళిని మ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు స్థానిక కూటమి నేతలతో చర్చించారు. **చల్లపల్లి** : చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు పరిశీలించారు. మండలంలో 1100 మంది పట్టభద్రులు ఓట్లు ఉండగా, పోలింగ్ ముగిసే సరికి 767 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 69.72శాతం ఓటింగ్ నమోదైనట్లు తహసీల్దార్ ఎం.హరనాథ్ తెలిపారు.ఆయన తెలిపారు. **కోడూరు** : కోడూరు స్త్రీ శక్తి, ఉర్దూ స్కూల్ వద్ద 934 మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తహసీల్దార్ బి.శ్రీను నాయక్ తెలిపారు. 65.96 శాతం ఓటింగ్ నమోదైనట్లు తెలిపారు. అవనిగడ్డ డిఎస్పీ విద్యశ్రీ పోలింగ్ కేంద్రం పరిశీలించారు. కూటమి నాయకులు నగదు ఓటర్లను ప్రలోభపెడుతున్నారని రైతు సంఘం నాయకులు ఆవుల బసవయ్య ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన డిఎస్పీ కూటమి నేతల శిబిరాన్ని పరిశీలించారు. **ఘంటసాల** : మండలంలో మొత్తం 1217 ఓట్లకు గానూ 808 ఓట్లు పోల్ కాగా, 66.39 శాతం నమోదైనట్లు తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని ఏఎస్పీ సత్యనారాయణ, డిఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ సందర్శించారు. పోలింగ్ సరళిని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో 69.96 శాతం పోలింగ్ నమోదైంది. చల్లపల్లి రాజా కళాశాలలో . మొత్తం 2024 మంది ఓటర్లకు గాను 1416 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎంఈవో పి.వెంకటేశ్వరరావు, పీఆర్ ఏఈ బొప్పన శ్రీనివాస్ పోలింగ్ అధికారులుగా వ్యవహరించగా, ఇన్‌చార్జి డీటీ జి.శ్రీలత, ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, సీఐ జి.ఈశ్వరరావు, ఎస్సై పిఎస్‌వి.సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. ఏఆర్ ఏఎస్పీ డి.సత్యనారాయణ, డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు చల్లపల్లి వచ్చి కూటమి నేతలతో పోలింగ్ సరళిని సమీక్షించారు.



పెడనలో ఓటు వేసేందుకు వెళ్తున్న దివ్యాంగురాలు, బందరులో చంటిబిడ్డతో ఓటు వేసేందుకు వచ్చిన బాలింత



చల్లపల్లిలో కూటమి నేతలతో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కొనకళ్ల నారాయణరావు... మోపిదేవి కేంద్రంలో అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్

ఆలపాటి విజయం తథ్యం

అవనిగడ్డ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ విజయం తథ్యమని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కార్యాలయంలో ఆరు మండలాల్లో జరిగిన పోలింగ్ సరళిపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ నేతృత్వంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్, పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్, స్వర్ణలత, మాచవరపు ఆదినారాయణ, న్యాయవాది కర్రా సుధాకర్, జడ్పీటీసీ మెడబలిమి మల్లిఖార్జునరావు, తుమ్మల చౌదరి బాబు, మోర్ల రాంబాబు, మెండు లక్ష్మణరావు, గుడివాక శేషుబాబు, మత్తి వెంకటేశ్వరరావు, రాయపూడి వేణుగోపాలరావు, తుంగల వెంకటగిరి, బండే శ్రీనివాసరావు, రావి నాగేశ్వరరావు పోలింగ్ సరళిని పర్యవేక్షించారు.

శరవేగంగా ఆక్విడెక్ట్ మరమ్మతు పనులు

అవనిగడ్డ రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : దివిసీమకు జీవనాడి పులిగడ్డ ఆక్విడెక్ట్ మరమ్మతు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇరిగేషన్ డీఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రెయిలింగ్స్ ఏర్పాటు చేస్తున్నారు.

పాపారావు భౌతికకాయానికి ఎమ్మెల్యే మండలి నివాళి

నాగాయలంక, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు బోనం పాపారావు గుండెపోటుతో మరణించాడు. నాగాయలంకలోని స్వగృహంలో పాపారావు భౌతికకాయానికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. సర్పంచ్ కైతేపల్లి అంకాలు, ఉప సర్పంచ్ తలశిల వెంకట నరసింహారావు, శీలం అశ్విన్ కుమార్, బండ్రెడ్డి నాగమల్లిఖార్జునరావు, మెండు లక్ష్మణరావు, ముమ్మారెడ్డి శ్రీనివాస్, బండ్రెడ్డి మల్లిఖార్జునరావు, ఉప్పల ప్రసాద్, గాజుల శంకరరావు తదితర నేతలు నివాళులర్పించారు.

నాణ్యతతో పనులు పూర్తి చేయండి

అవనిగడ్డ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో కాల్వలు, రెగ్యులేటర్ల పనులను పూర్తి నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఇరిగేషన్ ఎస్ఈ రావెళ్ల రవికిరణ్ సూచించారు. రూ.27 లక్షలతో జరుగుతున్న అవనిగడ్డరెగ్యులేటర్ పనులను డీఈ పులిగడ్డ వెంకటేశ్వరరావుతో కలసి రవికిరణ్ పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.



పెదకళ్లేపల్లిలో పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చల్లపల్లి రాజా వంశీయులు, మంగళసూత్రాలు చూపుతున్న అర్చకులు, కృత్తివెన్నులో కల్యాణ శోభతో దుర్గానాగేశ్వరస్వామి

నేత్రపర్వంగా దుర్గానాగేశ్వరస్వామి కల్యాణం

- పెదకళ్లేపల్లి, కృత్తివెన్నులో తిలకించి తరించిన భక్తజనం

మోపిదేవి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ కాశీ పెదకళ్లేపల్లిలోని దుర్గానాగేశ్వరస్వామి కల్యాణం గురువారం తెల్లవారుజామున నేత్రపర్వంగా జరిగింది. కల్యాణ మహోత్సవంలో భాగంగా ఎదుర్కోలు ఉత్సవం అత్యంత ఆసక్తికరంగా జరిగింది. అర్చకులు, గ్రామస్థులు, దేవదాయశాఖ ఉద్యోగులు ఎదుర్కోలు ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించి సింహ వాహనంపై స్వామి, అమ్మవార్లను ఆసీనులను గావించారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలైన చల్లపల్లి రాజా వంశీయులు యార్లగడ్డ శివరామప్రసాద్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణ మహోత్సవాన్ని ప్రారంభించారు. ప్రధాన అర్చకులు బుద్ధు నాగవరప్రసాద్ ఆధ్వర్యంలో అర్చక బృందం వేదమంత్రోచ్ఛరణల నడుమ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. మంగళ సూత్రాలను అర్చకులు ప్రదర్శించగా, భక్తులు కన్నులారా వీక్షించారు. మంగళసూత్రధారణ అనంతరం ముత్యాల తలంబ్రాల కార్యక్రమాన్ని చల్లపల్లి రాజా వంశీయులు సంప్రదాయబద్ధంగా ప్రారంభించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను విశేష అలంకరణ చేసి నందీవాహనంపై పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఈవో దాసరి శ్రీరామవర ప్రసాదరావు ఆధ్వర్యంలో ఎస్టేట్ దేవాలయాల ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు. **కృత్తివెన్ను** : మహాశివరాత్రి ఉత్సవాలు గురువారంకు రెండోరోజుకు చేరుకున్నాయి. కృత్తివెన్నులోని దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. నాగేశ్వరస్వామి పెళ్లి కుమారునిగా, దుర్గ, పార్వతిలను పెళ్లి కుమార్తెలుగా పట్టు వస్త్రాలతో అలంకరించి, వేదమంత్రోచ్ఛరణ నడుమ కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపారు. రమా సహిత వీరవెంకట సత్యనారాయణ స్వామి కల్యాణాన్ని కూడా శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఒకే వేదికపై శివకేశవుల కల్యాణం ఒకే వేదికపై జరగడం ఇక్కడ విశేషం. పెద్ద సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించి తరించారు. ప్రత్యేక పూజలు, అభిషేకలు నిర్వహించారు. రుద్ర యాగం, రుద్రాభిషేకం, వేదవిద్వత్ సభలను నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్‌తో పాటు పలువురు ప్రముఖులు స్వామి వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శివపార్వతిల ప్రతిమలతో పాటు ఇతర దేవదేవతల ప్రతిమలు ఆకర్షిస్తున్నాయి. శివాలయ శిఖరంపై ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు కోనేరులో ప్రతిబింబిస్తూ ఆకట్టుకున్నాయి.



కోడూరులో.. లక్ష్మీపురంలో

కోడూరు, లక్ష్మీపురంలో సోమేశ్వరస్వామి కల్యాణం

కోడూరు : కోడూరులో మహాశివరాత్రి సందర్భంగా సోమేశ్వరస్వామి కల్యాణం బుధవారం రాత్రి అర్చకులు శివరామకృష్ణ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. లింగోద్భవ కాలంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

చల్లపల్లి : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా లక్ష్మీపురంలోని శ్రీదుర్గా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామివారి కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు భమిడిపాటి బాలసుబ్రహ్మణ్యశర్మ, సాయిలు స్వామి..అమ్మవార్ల కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని కళ్యాణోత్సవాన్ని తిలకించారు.



పెడనలో లింగోద్భవ పూజలు

పెడన, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయ ప్రాంగణంలోని కాశీవిశ్వేశ్వర స్వామి ఉపాలయంలో బుధవారం అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెక్కు సంఖ్యలో భక్తులు తరలివచ్చి కాశీవిశ్వేశ్వర స్వామిని దర్శించుకుని మంత్రపుష్పం తీర్థప్రసాదాలు స్వీకరించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డా. కొల్లూరి చిన్నా పర్యవేక్షించారు.

విద్యార్థులు మంచి నడవడిక కలిగి ఉండాలి

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మంచి నడవడిక కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి కె.వి.రామకృష్ణయ్య అన్నారు. బలరామునిపేటలోని గాంధీ విద్యాలయం 56వ వార్షికోత్సవంలో రామకృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కె.వి.రామకృష్ణయ్య మాట్లాడుతూ, బాల్యం నుంచి విద్యార్థులు గ్రంథపఠనం చేయాలన్నారు. లక్ష్మీనృసింహ సోమయాజి వైశ్య సమాజం అధ్యక్షుడు, గాంధీ విద్యాలయం కార్యదర్శి తాడేపల్లి మెహర్‌బాబా అధ్యక్షత వహించారు. కన్వీనర్ ఎం.ఆర్.ఎన్.వి.ఎస్. చక్రవర్తి, కోశాధికారి కొప్పర్తి రవి, వైశ్యసమాజం కార్యదర్శి ఉడత్తు కిషోర్, హెచ్‌ఎంలు భవానీ, మోహిని, బొత్స సత్యనారాయణమూర్తి, సిహెచ్. వెంకటరామారావు పాల్గొన్నారు. జొన్నలగడ్డ మాధవి ఆధ్వర్యంలో విద్యార్థులు భగవద్గీత పఠనం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.



మాట్లాడుతున్న కె.వి.రామకృష్ణయ్య

కోలాటం గురువులకు ఆర్థిక ప్రోత్సాహకం

చల్లపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రాచీన కళలు కనుమరుగవుతున్న నేపథ్యంలో కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చల్లపల్లి ఉపసర్పంచ్ ముమ్మనేని నాని అన్నారు. చల్లపల్లికి చెందిన శాఖాంబరి మురళీకృష్ణ భక్తసమాజం (కోలాటం) కళాకారులకు రూ.10 వేలు ప్రోత్సాహక సహాయాన్ని గురువారం నాని అందచేశారు. కొత్త తరం కళాకారులను తయారుచేస్తున్న కోలాటం గురువు వేముల అంకంబొట్లును అభినందించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొక్కిలిగడ్డ మణిప్రభాకరరావు, వార్డుసభ్యుడు అంబటి భువనేశ్వరరావు, టీడీపీ నేత వేముల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధ దంపతులు బళ్లా కామేశ్వరరావుకు ఉపసర్పంచ్ నాని రూ.5 వేలు సహాయంగా అందజేశారు. వార్డుసభ్యుడు బళ్లా వాసు ద్వారా విషయం తెలుసుకుని సాయం అందించారు.

